క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన ఎస్సైలు

సాక్షి నెట్‌వర్క్: సాధారణ బదిలీల్లో భాగంగా పలువురు ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది. ఆదివారం ఆయా పోలీస్‌స్టేషన్లలో బాధ్యతలు చేపట్టారు. కొత్తగూడెం వన్‌టౌన్ ఎస్సైగా బి.శ్రీనివాస్, త్రీటౌన్ ఎస్సైలుగా జీవన్‌రాజు, విజయకుమారి, చుంచుపల్లి ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, పాల్వంచరూరల్ జె.కార్తీక్, పాల్వంచ పట్టణ ఎస్‌ఐగా బానాల రాము, సుజాతనగర్ ముత్తినేని సోమేశ్వర్, జూలూరుపాడు పురుషోత్తం, కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్‌ఐగా రాము బాధ్యతలు స్వీకరించారు.

మల్లు నందినికి ఘన స్వాగతం


అమ్మవారిని దర్శించుకుంటున్న నందిని

జూలూరుపాడు: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్కకు జూలూరుపాడులో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. పాల్వంచ మండలంలోని శ్రీ పెద్దమ్మతల్లి ఆలయాన్ని సందర్శించేందుకు వెళుతూ మార్గమధ్యంలో జూలూరుపాడులో ఆమె ఆగారు. కాంగ్రెస్ నాయకులు ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. మాళోత్ మంగీలాల్ నాయక్, కొమ్మినేని రాంబాబు, వాంకుడోత్ కిషన్ నాయక్, బానోత్ మంగూ, కొర్రా రవిచందర్, తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: మండల పరిధిలోని పెద్దమ్మ తల్లి ఆలయాన్ని ఆదివారం సీఎల్‌పీ నేత మల్లు భట్టి విక్రమార్క సతిమణి మల్లు నందిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈఓ రజనీకుమారి అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు. ఆమె వెంట కాంగ్రెస్ మహిళ నాయకురాలు, మాజీ ఎంపీటీసీ గంధం ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

ఘనంగా బోనాలు

టేకులపల్లి: చుక్కాలబోడు పంచాయతీ జేత్యా తండాలో ఆదివారం బొడ్రాయికి ఘనంగా బోనాలు సమర్పించారు. తండాకు చెందిన గిరిజన మహిళలు, యువతులు బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి ముత్యాలమ్మ, బొడ్రాయిల వద్ద ప్రదక్షిణలు చేసి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బద్దుతండాలో ఆదివారం గిరిజనులు వనభోజన కార్యక్రమం జరుపుకున్నారు. బంజారాల తొలిపండుగ సీత్లా తరువాత వనభోజనాలు జరుపుకోవడం ఆనవాయితీ. సమీపంలోని పంట పొలాల్లోకి వెళ్లి సామూహిక భోజనాలు చేసి, ఆటపాటలతో సందడి చేశారు.

ప్రమాదకరంగా పాఠశాల భవనం..


శిథిలావస్థలో సులానగర్ ప్రాథమిక పాఠశాల

టేకులపల్లి: టేకులపల్లి మండలం సులానగర్‌లోని ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇదే ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రం కూడా ఉంది. భవనం గోడలకు పగుళ్లు వచ్చాయి. ఈ వర్షాలకు ఏ క్షణమైనా కూలిపోయే పరిస్థితి. తాజాగా నాలుగు రోజుల పాటు కురిసిన వర్షానికి మరింత ప్రమాదకరంగా మారింది. ఈ భవనాన్ని కూల్చి వేయాలని ఎస్‌ఎంసీ కమిటీ మండల అధికారులకు రాతపూర్వకంగా లేఖలు కూడా ఇచ్చారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇటు పాఠశాల, అటు అంగన్‌వాడీ పిల్లలు ఆడుకునే ఆవరణలోనే శిథిల భవనం ఉండటంతో తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారు. భవనం కూలి ప్రమాదం జరగకముందే తగిన చర్యలు తీసుకోవాలని విద్యా కమిటీ సభ్యుల, గ్రామస్తులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

హడలెత్తిస్తున్న హైవే

- ఎత్తుపల్లాలుగా మారిన తారురోడ్డు
- వేగంగా వచ్చే వాహనాల్లో కుదుపులు
- మిషన్ భగీరథ పైపులైన్ల నిర్మాణంతో దెబ్బతిన్న ఫుట్‌పాత్‌లు


మిషన్ భగీరథ పైపులైన్ల నిర్మాణానికి తవ్విన రోడ్డు

పాల్వంచ: భద్రాచలం జాతీయ రహదారి హడలెత్తిస్తోంది. తారురోడ్డు ఎగుడుదిగుడుగా మారింది. వేగంగా వచ్చే వాహనాలు ఇక్కడకు వచ్చేసరికి ఒక్కసారిగా కుదుపులకు గురవుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు, స్థానికుల ఆందోళన చెందుకతున్నారు. ఇటీవల వెంగళరావు కాలనీకి చెందిన వ్యక్తి మోటర్ సైకిల్‌పై వస్తున్న క్రమంలో ఒక్కసారిగా ఊపేయడంతో డివైడర్‌కి తగిలి మృతి చెందాడు. ఇక ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఓ కారు ముందు వెళ్తున్న టూవీలర్‌ను ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు ఇలా తయారయిందని, ఈ రోడ్డు పరిస్థితి ఆందోళనకరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు.

పలుచోట్ల దెబ్బతిన్న రోడ్డు..

బీసీఎం రోడ్డుపై నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తెలంగాణ నుంచి ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు సైతం ఈ రోడ్డు గుండానే వాహనాలు వచ్చిపోతుంటాయి. కాగా అతి బరువుతో భారీ వాహనాల వల్ల రోడ్డు ఎత్తుపల్లాలుగా మారింది.

ముఖ్యంగా ఇంద్రకాలనీ నుంచి బస్టాండ్‌కు వచ్చే వరకు రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంది. లారీ ఓనర్స్ ఫంక్షన్ హాల్ నుంచి పాత పాల్వంచ మధ్యలో, కలెక్టరేట్ సమీపంలో, కొత్తగూడెం అడ్డరోడ్డు సమీపంలో కిలోమీటర్ల మేర రోడ్డు ఇలా ఎగుడుదిగుడుగా మారి ప్రమాదం పొంచి ఉంది. ద్విచక్ర వాహనాలు, కార్లలో ప్రయాణించే వారు తెలియక ఈ రోడ్డుపై వేగంగా వస్తే ఇక్కడకు వచ్చేసరికి ఒక్కసారిగా కళ్లు తిరిగినట్లుగా మారిపోతుంది. వాహనం పల్టీలు కొట్టిన ఫీలింగ్ వస్తుంది.

పైపులైన్లతో దెబ్బతిన్న ఫుట్‌పాత్‌లు..

నేషనల్ హైవే నిధులు రూ.కోట్లతో ఇటీవల రోడ్డు విస్తరణతో పాటు రోడ్డు పక్కన టైల్స్ ఏర్పాటు చేశారు. నవభారత్ నుంచి ఇందిరా కాలనీ వరకు టౌన్ మొదటి నుంచి చివరి వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ నిర్మించారు. కాగా సంవత్సరం గడవక ముందే ఈ ఫుట్‌పాత్‌లను మిషన్ భగీరథ పైపులైన్లు నిర్మించేందుకు తవ్వడంతో రోడ్డు అధ్వానంగా మారిపోయింది. వీటివల్ల రోడ్డు మరింత ప్రమాదకరంగా మారింది. రోడ్డు ధ్వంసం చేస్తుండటంతో అస్తవ్యస్తంగా మారింది. ఈ విషయమై నేషనల్ హైవే ఏఈ నరేశ్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.


ధ్వంసం చేసిన ఫుట్‌పాత్

ప్రమాదం పొంచి ఉంది



అతి భారీ వాహనాల రాకపోకల వల్ల జాతీయ రహదారి పొడవునా రోడ్డు ఎత్తుపల్లాలుగా మారింది. కొంచెం స్పీడ్‌గా వచ్చినా మోటర్ సైకిళ్లు, కార్లు కుదుపునకు లోనై ప్రమాదం జరిగే పరిస్థితి నెలకొంది. ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– అమీరుద్దీన్, పాల్వంచ

ఫుట్‌పాత్‌లను ధ్వంసం చేశారు



నేషనల్ హైవే ప్రమాదకరంగా మారింది. రెజీనా స్కూల్ ముందు రోడ్డు బాగా ఎగుడుదిగుడుగా ఉంది. తెలియని వారు, వేగంగా వచ్చే వాహనదారులు భయాందోళనకు గురి కావాల్సి వస్తోంది. అంతేగాక రోడ్డు పక్కన మిషన్ భగీరథ పైపులైన్ల నిర్మాణ కోసం టైల్స్ తొలగించారు.

– రమేశ్, పాల్వంచ

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదరించాలి


మాట్లాడుతున్న నర్సయ్య

కొత్తగూడెంటౌన్: తెలంగాణ ఉద్యమకారులను ముఖ్యమంత్రి ఆదరించాలని, ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ.10 వేల కోట్లు కేటాయించాలని 1969 తొలిమలి ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర గౌరవ చైర్మన్ శ్రావణబోయిన నర్సయ్య ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన రాష్ట్రస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ పోరాటంలో ముందుండి పోరాడిన ఉద్యమకారులకు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రెండుసార్లు ముఖ్యమంత్రి పీటం ఎక్కిన కేసీఆర్ ఉద్యమకారులను విస్మరించడం అన్యాయం అని, ఫలితం అనుభవించక తప్పదని హెచ్చరించారు. ఉద్యమంలో మరణించిన 1200 కుటుంబాలను ఆదుకోవాలని, ఉద్యమకారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఉచిత వైద్యం, ఉచిత రవాణ సౌకర్యం, పెన్షన్లు అందజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎం.వలీబాబా, అల్లి భాస్కర్, కూచన కృష్ణారావు, కాకెల్లి సైమన్, ఎడ్ల ఎలియా, సఫ్దార్‌బేగ్, దేవులపల్లి రామ్మూర్తి, జావేద్, మాతంగి లింగయ్య పాల్గొన్నారు.

రమేశ్‌కు సన్మానం


రమేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

పాల్వంచ: బీఆర్ఎస్ పార్టీ బీఆర్‌టీయూ కార్మిక సంఘం జిల్లా జనరల్ సెక్రటరీగా నియామకమైన టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చారుగుండ్ల రమేశ్‌ను స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో పుట్టపాక కిరణ్, రసూరి శ్రీను, రీజనల్ నాయకులు రవికుమార్, మాధవరావు, రాజేశ్వర్ రావు, విజయ్, శంకర్, నరేందర్, రవి, రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం


సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో పాల్గొన్న ఉద్యోగులు, కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని ఆర్‌సీహెచ్‌పీలో, సెంట్రల్ వర్క్‌షాపులో ఆదివారం సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ (ఏబీకేఎంఎస్ – బీఎంఎస్) 69వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఏరియా ఉపాధ్యక్షుడు మొగిలిపాక రవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యూనియన్ జాతీయ నాయకుడు పి.మాధవ నాయక్ యూనియన్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, మొగిలిపాక రవి, కుమారస్వామి, దాసరి శ్రీను, కోలువురి శ్రీనివాస్, కొత్తురు శ్రీనివాస్, ఉదయ్‌భాస్కర్, యాకుబుద్దీన్, ఆనంద్‌ప్రేమ్ పాల్గొన్నారు.


ఇల్లెందు: జెండా ఆవిష్కరించిన బీఎంఎస్ నేతలు

ఇల్లెందు: బీఎంఎస్ 69వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఇల్లెందులో ఘనంగా నిర్వహించారు. జేకే ఏరియాలోని బీఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు నాయని సైదులు జెండా ఎగుర వేసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీలాకృష్ణ, మాధవరెడ్డి, శశికుమార్, రాజశేఖర్, రాము, శివ, వెంకటేష్, కిరణ్, పరంజ్యోతీ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ


ట్రై సైకిళ్లు అందజేస్తున్న శ్రీనివాస్‌రావు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం నియోజకవర్గంలోని పది మంది వికలాంగులకు జీఎస్‌ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని జనహిత భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెల్త్ డైరెక్టర్, జీఎస్‌ఆర్ ట్రస్టు చైర్మన్ గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ... కొత్తగూడెం పరిసర ప్రాంతంలో డాక్టర్ జీఎస్‌ఆర్ ట్రస్టు ద్వారా విద్య, ఆరోగ్యం, ఉపాధి, రంగాలలో ముందు కెళ్తున్నట్లు చెప్పారు. కొత్తగూడెం, పాల్వంచ, నియోజకవర్గంలోని అన్నివర్గాల ప్రజలకు హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని, ఇప్పటి వరకు పలువురికి శస్త్రచికిత్సలు చేయించామన్నారు. ఎవరు ఏ సమస్య వచ్చినా జీఎస్‌ఆర్ ట్రస్టును సంప్రందించాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు అంజి, జోగారావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బుక్‌లెట్ ఆవిష్కరణ


బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): 11వ వేతన అగ్రిమెంట్‌లోని అంశాలను తెలుగులోకి అనువదించిన బుక్‌లెట్‌ను ఆదివారం సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. యూనియన్ బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కార్మికుల జీతం లెక్కించే విధానం, పెరిగిన అలవెన్స్‌ల వివరాలు, వీడీఏ వివరాలు ఈ బుక్‌లో వివరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వై.వెంకటేశ్వరరావు, కొత్తపల్లి రమేష్ బాబు, గడల నర్సింహారావు, ఎంఎస్ రావు, కే.సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న నరేష్

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం జరిగింది. గుగులోత్ నరేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. టేకులపల్లి మండలం తొమ్మిదోమైలు తండాకు చెందిన నరేష్ ఇల్లెందు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బాతుల వ్యాన్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు సిఫారసు చేశారు.

మణిపూర్ పాపం ప్రధానమంత్రి మోదీదే..

మణిపూరం పాపం ప్రధాని మోదీదేనని, అధికారం కోసం జాతుల మధ్య విద్వేషాన్ని సృష్టిస్తున్నారని పలువురు నాయకులు ఆరోపించారు. ఈ మేరకు కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, ప్రజా సంఘాల నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించి, మరణించిన ఆదివాసీ మహిళలకు నివాళుర్పించి రెండు నిముషాలు మౌనం పాటించారు. మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. వక్తలు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అక్కడున్న రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలను, మీడియాను అదుపు చేయడంలో చూపించిన శ్రద్ధ ఆదివాసీ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చూపించలేక పోయిందని ఆరోపించారు. మణిపూర్ ప్రజలకు దేశ ప్రజలు అండగా నిలవాలని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్


సింగరేణి(కొత్తగూడెం): రుద్రంపూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ


జూలూరుపాడు: ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు


ఇల్లెందు: సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ


ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న నర్సింహారావు

చదువుకుంటేనే సమాజంలో గౌరవం


భోజనాన్ని పరిశీలిస్తున్న సీఐ వినయ్‌కుమార్

పాల్వంచరూరల్: సమాజంలో గౌరవంగా బతుకాలంటే చదువు ఒక్కటే మార్గమని సీఐ వినయ్‌కుమార్ అన్నారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల (సీఓఈ) కళాశాలను సీఐ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రణాళికతో చదువుకుని లక్ష్యాన్ని సాధించుకోవాలన్నారు. కొంతమంది విద్యార్థులు, యువత పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడి గంజాయి, గుట్కా, మద్యానికి బానిసలవుతున్నారన్నారు. బాగా చదువుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని సూచించారు.

ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి


మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 27న జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం 19వ రోజుకు చేరుకుంది. జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఈ నెల 22న హైదరాబాద్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జేఏసీ నాయకులతో చర్చలు జరిపి ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించకుండా సమ్మె విరమించాలని కోరడం ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం తన నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే కార్మికుల డిమాండ్లు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కోరారు. కార్యక్రమంలో సారంగపాణి, యాకూబ్ షావలి, మోకాళ్ల రమేష్, రాంసింగ్, నబీ, జటంగి వెంకన్న, సామేలు, మోహన్‌రావు, నర్సింహారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రచ్చబండగా ఆశ్రమ క్రీడా పాఠశాల


ఆశ్రమ పాఠశాలలో పంచాయితీ చేస్తున్న పెద్దమనుషులు

పాల్వంచరూరల్: గిరిజన విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు రూ.లక్షలు వ్యయం చేసి నిర్మించిన క్రీడా మైదానం పోలీసుస్టేషన్‌కు వచ్చే పంచాయితీలకు రచ్చబండగా మారింది. మండల పరిధి కిన్నెరసానిలోని గిరిజన ఆశ్రమ క్రీడాపాఠశాలకు చెందిన క్రీడా మైదానం రూరల్ పోలీసుస్టేషన్ ఎదుట ఉంది. ఇక్కడకు వచ్చే ఫిర్యాదుదారులు పరిష్కారానికి పాఠశాలలోని క్రీడామైదానాన్ని వేదికగా చేసుకుంటున్నారు. అయినా సంబంధిత హెచ్‌ఎం గానీ పీఈటీలుగా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆదివారం నాగారం కాలనీకి చెందిన భూవివాదం పంచాయితీ కోసం పోలీసుస్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులు క్రీడామైదానం వేదికపై కూర్చుని పంచాయితీ చేసుకున్నారు. గ్రౌండ్ ప్రధాన గేటుకు తాళం వేయకపోవడంతో పోలీసుస్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులంతా క్రీడా మైదానాన్ని వినియోగించుకుంటున్నారు. మైదానం గేటుకు తాళం వేయకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో పశువులు, కుక్కలు, మేకలు, గొర్రెలు సైతం మైదానంలో సంచరిస్తునాయి.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సారంగపాణి

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేశారు. ఇఫ్టూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు 19 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. కార్మికులకు వేతనాలు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని కోరారు. తోడేటి నాగేశ్వరరావు, డి.ప్రసాద్, మోత్కూరి మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అయ్యేదాకా పోరు


మాట్లాడుతున్న ఆనందరావు

ఇల్లెందు: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరు సాగుతుందని ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ నియోజకవర్గ నాయకుడు ఆనందరావు మాదిగ అన్నారు. ఆదివారం ఇల్లెందులో జరిగిన 24 ఏరియా భూపేష్‌నగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎస్సీ వర్గీకరణకు డిమాండ్ చేస్తూ ఆగస్టు రెండోవారంలో హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి సదస్సు జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సును విజయవంతం చేసేందుకు సోమవారం ఇల్లెందులో ఐతా ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పిస్ జిల్లా స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెంతెన వసంతరావు, కోటీ, కోటేశ్వరరావు, రత్నాకర్‌రావు, అశోక్, సాలయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


1882 - 83 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర హైస్కూల్ (బాలుర) పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పాఠశాలలో 1982–83లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పాల్గొని తమ చిన్ననాటి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. కుటుంబ, ఉద్యోగ విషయాలను ఒకరితో ఒకరు మనసువిప్పి మాట్లాడుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ప్రతిసంవత్సరం ఇలాగే కలుసుకోవాలని ప్రణాళిక రూపొందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులను సన్మానించారు.

అటెన్షన్ ప్లీజ్

కల్వర్టు నిర్మించరూ..

ఇల్లెందు మండలంలోని బాలాజీనగర్ గ్రామ పంచాయతీ సంజయ్‌నగర్‌లో రెండు సీసీ రహదారుల మధ్య కల్వర్టు నిర్మాణాన్ని గ్రామ పంచాయతీ అధికారులు విస్మరించారు. దీంతో అటుగా వచ్చిన వాహన చోదకులు, రాత్రి వేళ పాదచారులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మట్టి కూడా కొట్టుకుపోతుండటంతో రహదారి మరింత ప్రమాదకరంగా మారింది. అధికారులు తక్షణం స్పందించి కల్వర్టు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

- ఇల్లెందురూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : నీలిమ, కార్యదర్శి, బాలాజీనగర్ గ్రామపంచాయతీ
సెల్ నెంబర్: 9346931114

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824
లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148
భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476
ఇల్లెందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గారాంప్రసాద్ -79979 58226
టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148